ఆర్.డి.టి

ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం మార్చి 2007

FOR PRIVATE CIRCULATION ONLY

## మీకు తెలుసా !

పంటల స్వభావాన్ని మార్చే జన్యుమార్పిడి విత్తనాలకు వ్యతిరేకంగా పర్యావరణ వాదులు, ఆరోగ్య శాస్త్ర నిపుణులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. జన్యుమార్పిడి జరిగే విత్తనాలు వాతావరణ కాలుష్యం వెదజల్లడమేగాకుండా జీవజాతుల మనుగడకు కూడా విఘాతం కలుగుతుందని మనల్ని హెచ్చరిస్తున్నారు. అయినా ప్రభుత్వాలు అంతర్జాతీయ వ్యాపార సంస్థల ఒత్తిడులకు లొంగి వాటిని అనుమతిస్తూనే ఉన్నాయి.

అదిలాబాద్ జిల్లాలో బి.టి. పత్తివేసిన పొలాల్లో, పంట అయిపోయిన తర్వాత అవశేషాల్ని మేసి, గత రెండు మాసాలలో 200 పశువులు మరణించినాయట. బతికి ఉన్నవాటిలో కూడా అనారోగ్యానికి గురయిన పశువులలో విషప్రభావం ఎక్కువగా ఉందని పశువైద్య శాఖ అధికారులు ఆందోళనపడుతున్నారు. దీనికి కారణం పత్తి పంట చేలల్లో పశువులు అవశేషాలు మేయడమేయని వైద్యులు నిర్ధారిస్తున్నారు. తాళ్ళ మడుగు అనే గ్రామంలో ఒక ఎద్దు చనిపోతే, వైద్య పరీక్షలలో ఎద్దు జీర్ణాశయంలో బిటి పత్తి పంట మొదళ్ళు, ఆకులు ఉన్నాయి. అదిలాబాదు పొరుగు జిల్లాలో కూడా గొర్రెలలో విషపదార్థాల ప్రభావంతో వ్యాధులు ఎక్కువవుతున్నాయని గమనించిన పశు సంవర్థక శాఖ అధికారులు వాటి వివరాలు సేకరించే పనులలో నిమగ్నమయినారట.

(హిందూ 2-3-2007 దినపత్రిక ఆధారంగా)

**చిట్కా :**

**పంటినొప్పితో బాధపడేవారికి ఆ పంటికి లేదా చిగురుకు చేరువలో చిన్న ఉల్లిగడ్డను ఉంచితే కాసేపటికి నొప్పి తగ్గుముఖం పడుతుంది.**

## మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా లోకానికి శుభాకాంక్షలు !

## మహిళల హక్కులకై పోరాడుతున్న వారికి జేజేలు !!

ఆకాశంలో సగం, భూమ్మీద సగం అన్నింట్లోనూ సగం – సగం. అతిముఖ్యమైన మొదటి సగానికి చెందిన మహిళలు, పనిచేయడానికి చేతులు, ఆలోచించడానికి మెదడు ఉన్న మహిళలు, గత సంస్కృతీ వారసత్వాలను పరిరక్షిస్తూ ఎంతో నేర్పుగా భావితరాలకు అందించే మహిళలు ఇంకా గృహహింసతో పాటు అనేక వివక్షతలకు గురవుతుండడంవల్ల మన సమాజాలు అనాగరిక స్థాయిలోనే ఉన్నట్లు తెలుస్తున్నది. నాగరికత అంటే ఆధునిక విజ్ఞానం కలిగి ఉండి, సంపదతో కూడిన సౌకర్యాలు అనుభవిస్తూ, చదువు ఇచ్చిన చక్కటి భావ వ్యక్తీకరణతో మాట్లాడటం కాదు. నాగరికత అంటే, చదువున్నా లేక పోయినా, సంపద ఉన్నా లేకపోయినా, ప్రకృతి సిద్ధమైన మానవీయ విలువలతో కుటుంబ సభ్యులతో పాటు, చుట్టూ సమాజంలోని వారిని గౌరవించడం. అంటే పరిపూర్ణ మనిషిగా ప్రవర్తించడం. వీళ్ళనే నాగరికులుగా, నాగరిక సమాజ వారసులుగా మనం భావించాలి.

మాతృ సమాజం నుండి పితృ సమాజానికి మార్పు చెందిన క్రమంలో, మహిళలు అనేక రకాలుగా దోపిడీకి, వివక్షతకు గురవుతూఉన్నారు. కొన్ని వందల సంవత్సరాలుగా మహిళల బాధల్ని కష్టాలను, కన్నీళ్ళను పూర్తిగా విస్మరించిన సమాజాన్ని మేల్కొపడానికి, చైతన్యవంతమైన మహిళలు నేటిదాకా కృషిచేస్తూనే ఉన్నారు. వివక్షతకు వ్యతిరేకంగా ధిక్కార స్వరం వినిపిస్తూనే ఉన్నారు. మహిళలను పరాధీన స్థానం నుండి ఆత్మగౌరవం, తమదైన వ్యక్తిత్వం, స్వేచ్ఛ స్వాతంత్ర్యాలుగల మహిళగా మార్చే, ప్రయత్నాలు చేస్తున్నారు. వారి కృషి ఫలితంగానే ప్రతి యేటా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ దినంగా పరిగణిస్తున్నారు. అంతర్జాతీయ దినంగా వేడుకలు జరిపినంతమాత్రాన మహిళల జీవితాల్లో మార్పులు వస్తాయా ? అని ప్రశ్నించే వారు లేకపోలేదు. మహిళలకంటూ ఒక అంతర్జాతీయ దినం జరినంతమాత్రాననే సమస్యలు తొలగిపోవు. అనంతమైన మానవ సమాజంలో ఏ ఒక్క చర్యతోనే మార్పు పూర్తిగా రావడం సాధ్యంకాదు. నిరంతర పోరాటం, కృషి, పట్టుదలలు భూమికగా సాగే చైతన్య ప్రవాహంలో నిస్సందేహంగా మహిళాదినోత్సవం ఆత్మగౌరవ సాధికారతకు ఒక చిహ్నంగా నిలుస్తుంది. సమాజపు దౌష్ట్యనీతికి వ్యతిరేకంగా మహిళలు ధిక్కార స్వరం వినిపింపజేయడంలో పాటుపడుతున్న కార్యకర్తలందరినీ నేను అభినందిస్తున్నాను. మహిళలు చేసిన ఈ పోరాటాలవల్లనే ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు చేశాయి. అందులో ముఖ్యంగా సమాన పనికి సమాన వేతనం అన్నది. ఉపాధి హామీ పథకంలో శ్రమ చేసే మహిళలకు, పురుషులతో సమానంగా వేతనం పొందే హక్కు, మంచి నీటి సదుపాయం, పసిపిల్లలున్న వారికి రక్షణగా క్రష్‌ల ఏర్పాట్లు. ఇవి మహిళల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని రూపొందిన చట్టాలే. మహిళలు ఎంత చదువుకుని ఉన్నత పదవులు అధిరోహించినా, లైంగిక వేధింపులు తప్పడంలేదు. ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో స్పందిస్తూ భారత దేశ అత్యున్నత న్యాయస్థానం లైంగిక వేధింపులలో అనుసరించాల్సిన పద్ధతులు, ప్రభుత్వాల బాధ్యతలను మార్గదర్శకాలను సూచించింది. దాని ప్రకారం, జిల్లా స్థాయిలోను, కార్యాలయాల స్థాయిల్లోను మహిళా ఉద్యోగులకు రక్షణగా ఎటువంటి చర్యలు లైంగిక వేధింపులకిందకు వస్తాయో, వాటిని నేరంగా ఎలా పరిగణించాలో విశదపరుస్తూ ప్రభుత్వాలు ఉత్తర్వులు ఇచ్చినాయి. మహిళల పోరాటాలు ఒత్తిడుల ఫలితంగానే మహిళల గృహహింస రక్షణ చట్టం 2005 ను ప్రభుత్వం రూపొందించింది. ఇది 26-10-2006 నుండి →

అమలులోకి వచ్చింది. గతంలో మహిళలపై లైంగిక దాడులు, లింగ వివక్షతలు, కుటుంబాల బయటనే జరుగుతాయని అందరూ విశ్వసించేవారు. అందుకే అన్ని మతాల మతగ్రంథాలలో మహిళలు అబలలని, బాల్యంలో తండ్రి, వివాహం అయిన తర్వాత భర్త, వృద్ధాప్యంలో కుమారుల సంరక్షణలో మహిళలు ఉండాలని ఉద్బోధిస్తున్నాయి. కానీ కుటుంబాల నాలుగు గోడల మధ్యనే మహిళలు భర్త, ఇతర కుటుంబ సభ్యులు, అత్తమామల చేతిలో హింసకు గురవుతున్నట్లుగా, లైంగిక అత్యాచారాలకు కూడా గురవుతున్న విషయాల్ని మహిళా కార్యకర్తలు సమాజం దృష్టిలోకి తేవడంలో కృతకృత్యులయ్యారు.

ఇటీవల భారతప్రభుత్వ కుటుంబ ఆరోగ్యశాఖవారు నిర్వహించిన సర్వేలో రాష్ట్రాల వారీగా, పెద్ద పట్టణాలవారిగా కుటుంబ హింసకు గురవుతున్న మహిళల శాతాన్ని ప్రకటించారు.

**జాతీయ కుటుంబ ఆరోగ్య శాఖవారు నిర్వహించిన తాజా సర్వేలో రాష్ట్రాలవారిగా కుటుంబ హింసకు గురవుతున్న గ్రామీణ ప్రాంతాలలో 40.2 శాతం మంది గృహ హింసకు లోనవుతున్నారు. వీరిలో చదువుకున్నవారు 16 శాతం మంది.**

| | | | |
|---|---|---|---|
| బీహారు | 58.5% | హర్యానా | 27.3% |
| రాజస్థాన్ | 46.3% | గుజరాత్ | 27.6% |
| మధ్యప్రదేశ్ | 45.8% | పంజాబ్ | 25.4% |
| త్రిపుర | 44.1% | మిజోరాం | 22.5% |
| మణిపూర్ | 43.9% | కర్నాటక | 20.0% |
| ఉత్తరప్రదేశ్ | 42.4% | జమ్ము-కాశ్మీర్ | 12.6% |
| తమిళనాడు | 41.9% | మేఘాలయ | 13.1% |
| పశ్చిమ బెంగాల్ | 40.3% | నాగాలాండ్ | 15.4% |
| అరుణాచల్ ప్రదేశ్ | 38.8% | సిక్కిం | 16.5% |
| ఆంధ్రప్రదేశ్ | 35.2% | కేరళ | 16.4% |
| అస్సాం | 39.6% | ఛత్తీస్‌ఘడ్ | 30.0% |
| ఒరిస్సా | 38.5% | జార్ఖండ్ | 37.0% |
| మహారాష్ట్ర | 30.7% | ఉత్తరాఖండ్ | 28.0% |

ఆయా రాష్ట్రాలలో కుటుంబ హింసకు, మహిళల్లో అధికంగా చదువరులున్న పట్టణ ప్రాంతాలలో 30.4 శాతం మహిళలు కుటుంబ హింసకు గురవుతుండగా, గ్రామీణ ప్రాంతాలలో నిరక్షరాస్యులు అధికంగా ఉన్నచోట దాదాపు 40.20 శాతం మంది కుటుంబ హింసకు లోనవుతున్నారు. చదువుకున్నవారు 16 శాతం మంది గృహ హింసకు లోనవుతున్నారు. పట్టికను గమనించండి. దీనిని బట్టి అర్థమవుతున్నదేమంటే, కుటుంబ హింస అనేది కేవలం చదువురానివారికే పరిమితం అవడంలేదు. చదువులు కలిగి చట్టాలు తెలుసుకున్నవారికి కూడా ఈ హింసలు తప్పడం లేదు. కాకపోతే తేడాఅల్లా చదువుకుని ఆర్థిక స్వావలంబన కలిగిన వారిలో ఈ శాతం తక్కువగా ఉంటోంది. అందుకే ఉత్పత్తి వనరులకు మహిళల సాధికారతకు లంకె ఉంది. ఉత్పత్తి వనరులపై మహిళలకే అధిపత్యం ఉండాలి. ఈ దిశగా సాగే చైతన్య నివాదం హింసను అరికట్టడానికి తోడ్పడుతుంది. మరొక విషయం - ఉత్పత్తి వనరుల సాంక్రమణతోపాటు, మహిళలకు సామాజిక రక్షణ కల్పించడం, చట్టం, పాలనా విభాగాలు అండగానిలబడడం. మహిళల ఆత్మగౌరవానికి భంగకరంగా వ్యవహరించే వారిమీద కఠిన శిక్షలు అమలు చేయడంలాంటివి జరిగాయి. వాస్తవంగా సమాజంలో సగభాగం ఉన్నటువంటి మహిళలకు సమాజ గమనంలో ప్రముఖ పాత్ర వహించే మహిళల హక్కుల రక్షణకు చట్టాలు కావలసి రావడం సమాజపు దౌర్భాగ్యం. అయితే అన్యాయమైన పరిస్థితులున్నపుడు, అసమాన సామాజిక న్యాయపరిస్థితులున్నపుడు చట్టాలు అవసరం తప్పనిసరి. ఈ సందర్భంలో మహిళా గృహహింస రక్షణ చట్టం 2005 ఏ మేరకు మహిళలకు రక్షణ ఇస్తుందో, అది అమలు అయ్యే విధాన్ని గురించి తెలుసుకుందాం.

ఈ చట్టం దురాచారవర్తనుడితో ఉంటున్న లేదా సంబంధం ఉన్న స్త్రీలకు ఈ చట్టం వర్తిస్తుంది. కక్షిదారులిద్దరు ఒకే ఇంట్లో కలసి ఉండాలి. వారి మధ్య రక్త సంబంధం, వైవాహిక, లేదా వైవాహిక స్వభావం లేదా అనకృత సంబంధ ఉండాలి. దీనికి అదనుగా కుటుంబ వ్యక్తులతో సంబంధం కలిగి ఉమ్మడి కుటుంబంలో ఉన్నా ఇది వర్తిస్తుంది. ఈ చట్టం ద్వారా దురాచార వర్తనుడితో జీవిస్తున్న మహిళలకు, అక్కచెల్లెళ్ళకు, వితంతువులకు, తల్లులకు, వివాహం కాని స్త్రీలకు చట్టపరమైన రక్షణ కల్పిస్తుంది. ఈ చట్టం భార్యకు లేదా వైవాహిక సంబంధం ద్వారా జీవిస్తున్న మహిళలకు భర్త సంబంధీకులపైన లేదా పురుష భాగస్వామిపైన ఫిర్యాదు చేసే అవకాశం కల్పిస్తుంది. కాని దీని ద్వారా భర్తకు సంబంధితులైన మహిళలకు లేదా పురుష భాగస్వాములకు భార్యపై లేదా స్త్రీభాగస్వామిపై ఫిర్యాదు చేసే అవకాశం కల్పించదు. గృహహింస అంటే వాస్తవ దురాచారం లేదా బెదిరింపు లేదా శారీరక, లైంగిక, మౌఖిక, మానసికోద్రేక పూరితమైన లేదా వారి బంధువులను చట్ట విరుద్ధంగా వరకట్న డిమాండ్ల కోసం పీడించడం కూడా గృహహింస నిర్వచనంలో భాగంగా పరిగణిస్తారు.

స్త్రీలకు గృహ నివాస హక్కులను కల్పిస్తుంది. వైవాహిక సంబంధ గృహ నివాస హక్కు లేదా ఉమ్మడిగా జీవించే హక్కును చట్టపరంగా లేదా హక్కు లేదా ఉమ్మడిగా జీవించే హక్కును చట్టపరంగా లేదా హక్కులు ఆ నివాసంలో లేకపోయినా కల్పిస్తుంది. ఆ హక్కును నివాస ఉత్తర్వు ద్వారా పొందుతుంది. అటువంటి ఉత్తర్వును మేజిస్ట్రేట్ జారీ చేస్తారు.

ప్రతివాది తలపెట్టే లేదా గృహహింస కార్యకలాపాలకు లేదా ఇతర నిర్ధారిత చర్యలను నిరోధించేందుకు బాధితురాలికి అనుకూలంగా మేజిస్ట్రేట్ సంరక్షణ ఉత్తర్వులు జారీ చేసే అధికారం కల్పిస్తుంది. ఈ గృహహింస కార్యస్థానంలోగానీ, లేదా బాధితురాలు తరచు ఉండే ఏ ఇతర స్థానంలోనైనా కావచ్చు. సదరు వ్యక్తితో సంభాషించవచ్చు. ఇరుకక్షిదార్లు ఉపయోగించే ఆస్తుల నుంచి బాధితురాలిని విడదీయవచ్చు. బాధితురాలని హింసించవచ్చు. బాధితురాలికి గృహ హింసకు వ్యతిరేకంగా సహాయం చేస్తున్న సంబంధీకులకు లేదా ఇతరులకు హింస తలపెట్టవచ్చు.

బాధితురాలైన వ్యక్తి వైద్య పరీక్షలకు, న్యాయ సహాయం కోసం సురక్షితమైన నివాసం మొదటి వాటికోసం ప్రభుత్వేతర సంస్థలను సేవా సహాయకారులు గానూ, రక్షణాధికారులను నియమించే అధికారం కల్పిస్తుంది.

మన జిల్లాలో చట్టంలోని సెక్షను (3) ప్రకారం, మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారి రక్షణ అధికారిగా నియమితులయ్యారు. ఈ చట్టం క్రింద ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలన్నీ ప్రాజెక్టు అధికారి నిర్వహిస్తారు.

చట్టాల అమలును కూడా మనం సమర్థవంతంగా అమలు జరిపేటట్లుగా కృషిచేయాల్సి ఉంది. చట్టం అమలు కేవలం మహిళల బాధ్యతకాదు. కుటుంబంలో ఒక మానవీయ వాతావరణం ఏర్పాటు చేయడంలో, తల్లిని, చెల్లిని, కూతురును స్వంత వ్యక్తిత్వం ఆలోచన సరళిగల సభ్యులుగా గుర్తించడంలో పురుషులు కూడా ముందడుగు వేయాలి. కుటుంబంలో వ్యక్తి స్వేచ్ఛను గౌరవించలేని వారికి సమాజంలో హక్కులు కోరే నైతిక హక్కు ఉండదు. మరుసటి సంవత్సం మార్చి 8 లోగా ఈ దిశగా మనమందరం మరింత పురోగతి సాధించాలని ప్రతినబూనుదాం.

మీ శ్రేయోభిలాషి,

**వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఏకాలజి**

## నీతి వాక్యం :

ఆ॥ అరిషడ్వర్గంబులచే
నరులెల్లజిక్కిసొక్కినైజము విడకే
యొరుగుదురు గాక యెరుఁగక
మదుగైనది బ్రహ్మమను మహిలోవేమా !

### తాత్పర్యము:

కామ, క్రోద, లోభ, మద మాత్సర్యములు అనెడి శత్రువుకు లొంగిపోయి, సహజమగు మనశ్చాంచల్యంవలన మరుగుపడియున్న బ్రహ్మను తెలుసుకొన లేకపోతున్నారు.

### చర్చ :

వేమన వాడిన మాటల్లో బ్రహ్మ అంటే ఆత్మ జ్ఞానము. ఆత్మజ్ఞానము అంటే ఒక మానవీయ దృక్పథం, మనిషికి ప్రకృతి నిర్ధేశించిన జ్ఞాన జీవం. పశువులకు మనుషులకు ఉన్న తేడా ఆలోచన శక్తి. మనిషి తాను సంపాదించుకున్న జ్ఞానాన్ని మెదడులో నిల్వ ఉంచుకుంటాడు. పశువుకు అది సాధ్యంకాదు. అందుకే మానవ జీవనాన్ని సార్థకపరచుకోవడం అంటే ఆత్మజ్ఞానంతో తప్పొప్పులను గుర్తెరుగుతూ సాత్విక జీవనాన్ని అవలంబించడం.

కామం, క్రోధం, మదం, మాత్సర్యాలు మనిషికి ప్రధాన శత్రువులని వేమన చెప్పగలిగినాడుగానీ, ధన సంపాదన, అధికార దాహం కూడా మనిషికి శత్రువులని వేమన చెప్పలేదు. బహుశా వేమన కాలంనాటికి ఈ రెండు అంశాలకు పెద్ద ప్రాధాన్యత ఉండకపోవచ్చు. కాలాలు మారినా, విజ్ఞానం పెరిగినా, మనిషిని పట్టి పీడించే ఈ దుర్గుణాలు నశించడం లేదు. పైగా అనేక రూపాలలో విస్తృతి చెందుతూనే ఉన్నాయి. గతంలో జ్ఞానం, ఆత్మజ్ఞానం అనే మాటలకు పెద్దగా తేడా ఉండేదికాదు. దాదాపు సమానార్థకంలో ఉండేది. ఇప్పుడు జ్ఞానం, ఆత్మ జ్ఞానం రెండింటి మధ్య దూరం పెరగుతూ ఉంది. ఆత్మ జ్ఞానం కలిగిన వ్యక్తి మానవీయ పద్ధతులతో సమాజ శ్రేయస్సే కాంక్షగా బతుకుతూ ఉంటే, జ్ఞానం మాత్రమే కలవాడు తాను సంపాదించుకున్న విద్యాజ్ఞానంతో ప్రజలను మోసం చేయడానికి సాహసిస్తున్నాడు. ధన సంపాదన, అధికార వ్యామోహంతో సమాజ శ్రేయస్సుకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ దుర్గుణాలు ఆనాటి నుండి ఈనాటి వరకూ మనిషిలో ఎక్కడి నుండో ఊడిపడినవి కావు. మనిషిలో అంతర్ముఖంగా ఉండేవే. కానీ ఆత్మజ్ఞానం కలవాడు వాటిమీద నియంత్రణ సాధించి, మనసా, వాచా, కర్మేణా సమాజహితవుతో మెలగగలుగుతున్నాడు. వీటిని నియంత్రించలేని వాడు జ్ఞాన సముపార్జన గావించినా, తనకున్న జ్ఞానంతో ప్రజలను మరింత సులువుగా మోసం చేయటానికి ప్రయత్నిస్తున్నాడు. అవి బలం సాధించుకుంటే సన్మార్గం అనే బ్రహ్మజ్ఞానం మరుగునపడుతుంది.

**వై.వి. మల్లారెడ్డి**

## ఈ మాసంలో వ్యవసాయం

### పురుగుమందుల్లేని వ్యవసాయ కార్యక్రమం ఉద్దేశం

## 'రైతులను ఆలోచింపజేయడమే ఎన్.పి.ఎం.లో అతి పెద్ద లాభం'

"ఎన్.పి.ఎం.లో చెబుతున్నవన్నీ ఇంతకు ముందు నుంచీ ఉన్నవేనని, చాల ఏళ్లుగా 'ఐపిఎం'లో ఇవన్నీ చేస్తున్నామని అనుకోగానే సరిపోదు. దానివల్ల పురుగుమందుల వినియోగం ఏమయినా తగ్గిందా, వ్యవసాయం ఎదుర్కొంటున్న సమస్యలేమయినా పరిష్కారమయ్యాయా అని ఆలోచించాలి. ఉన్న వాస్తవాలను గుర్తించి సమస్యల పరిష్కారానికి చేయాల్సిన పని ఏమిటో నిర్ణయించుకోవాలి. ఏడెమిదేళ్లుగా ఎన్.పి.ఎం. మీద పని చేస్తున్నారు. రైతులు మంచి ఫలితాలు సాధించారు. ఇప్పుడు ఎన్.పి.ఎం. వ్యాప్తి కార్యక్రమంలో రైతులు ఏమి సాధించారో కూడా గుర్తించాలి. ఇది రైతులను శాస్త్రవేత్తలుగా మార్చే కార్యక్రమం. విజ్ఞానం ఎక్కడున్నా గౌరవించాల్సిందే. విశ్వవిద్యాలయాలలో, ఇతర సంస్థల్లో విజ్ఞానం ఉంది. అది రైతులను ఆలోచింపజేసే క్రియాశీల కార్యక్రమంగా మారాలి.

అసలు శాస్త్ర విజ్ఞానం అంటే ఏమిటి ? ప్రకృతిలో జరిగే విషయాలను పదే పదే గమనిస్తూ, ఆచరణానుభవాల నుంచి నేర్చుకుంటూ, నిగ్గుదేల్చుకుని తిరిగి ఆచరణకు వెళ్లడమే సైన్సు. ఈ పని ఎన్.పి.ఎం.లో జరుగుతోంది. ఇప్పటికీ ఇది పూర్తి నిర్దుష్టం (పర్‌ఫెక్ట్) అని చెప్పడం లేదు. అనుభవంలో ఎదురయిన లోపాల్ని సవరించుకుంటూ, పనిని మెరుగుపర్చుకుంటూ ముందుకు సాగాలి.

దీనివల్ల ఏ రైతూ ఏ విధంగానూ నష్టపోలేదు. రైతులు పలు రకాలుగా లాభపడ్డారు. అన్నిటికన్న పెద్ద లాభం...రైతులు శాస్త్రజ్ఞులుగా మారడం, వారిలో ఆలోచన శక్తి పెరగడం. విశ్వవిద్యాలయాలు, 'సుస్థిర వ్యవసాయ కేంద్రం', 'వాసన్'....ఎవరయినా ఆలోచించవలసిందీ, పట్టించుకోవలసిందీ ముఖ్యంగా ఈ విషయాన్నే.

వ్యవసాయం రంగం పేరిట ఏమి జరిగినా పునాది లేకుండా మేడలు కట్టి ప్రయోజనం లేదు. 4% అభివృద్ధి రేటు మంచి మాటే. దాన్ని సాధించాల్సిందే. రైతుల కాళ్లు చేతులు కట్టేసి అభివృద్ధి రేటు సాధించాలంటే సాధ్యంకాదు. ఇన్నాళ్లు వ్యవసాయం అప్పిచ్చేవారికి తప్ప మరెవరికీ లాభకరం కాని పరిస్థితిలో ఉంది.

రుణ సదుపాయం, ఉత్పాదకాలు, విస్తరణ (ఎక్స్‌టెన్షన్) అనేవి వ్యవసాయ అభివృద్ధికి చాలా ముఖ్యం. అవి దేని దారి దానిదే అన్నట్లు కాకుండా సమీకృత రూపంలో రైతులకు అందాలి. ఉదాహరణకి - రైతులకు సరైన సమయంలో సరైన సలహాలు అందించే విస్తరణ వ్యవస్థ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఏర్పడాలి. అలాగే రైతులకు సకాలంలో రుణ సదుపాయం అందాలి. రైతులు రుణం కోసం ఏ పురుగుమందుల మనిషి దగ్గరకో ఎరువుల మనిషి దగ్గరికో వెళ్లాల్సి రాగూడదు. అందుకే స్వయం సహాయక మహిళా బృందాల ద్వారా రైతులకు రుణ సదుపాయం కల్పించే కార్యక్రమం తీసుకుంటున్నాం.

మార్కెటింగ్ సదుపాయాల్ని కూడా మెరుగుపర్చాల్సివుంది. పాణ్యం మహిళలు ఎన్.పి.ఎం. పద్ధతిలో పండించిన ధాన్యాన్ని తామే మర ఆడించి తామే అమ్ముకున్నామని చెప్పారు. ఇలా గ్రామం పరిధిలోనే మార్కెటింగ్ సదుపాయం ఏర్పడాలి. దీనికి 'ఆహార భద్రత' అనే దానికీ సంబంధం ఉంది. మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. కొన్ని చోట్ల కందులు కూడా. ఇవి బయట అమ్మడానికి కాదు, అవసరం సమయాలలో ప్రజలకు అప్పుగా ఆహార దినుసులు అందించి 'ఆహార భద్రత' కల్పించడానికే.

రైతులకు వ్యవసాయం లాభకరం కావలంటే, వారు పండించిన పంటల వినిమయం పెరగాలి. అది జరగాలంటే ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగాలి. దీన్ని దృష్టిలో ఉంచుకునే ధాన్యం, పప్పులు కొనుగోలు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నాం. చాలా

చోట్ల 'సహకార సంఘాలు' కుప్పకూలుతున్నాయి. అదృష్టవశాత్తు మండల మహిళా సమాఖ్యాలు 'సహకార సంఘాల' పాత్రను నిర్వహించే శక్తిని సంపాదించుకుంటున్నాయి.

విశ్వవిద్యాలయాలు, పరిశోధన కేంద్రాలు రైతులకు వ్యవసాయ-ఉత్పాదక శక్తి-పెంపుదలకు సంబంధించిన జ్ఞానాన్ని అభివృద్ధి చేయడమేగాక దాన్ని ప్రజలకు ఎలా అందించాలో కూడా ఆలోచించాలి. ఇరవై ఏళ్లుగా లేదా ముప్పై ఏళ్లుగా ఎవరు ఏం చేశారు అనేది కాదు. వాటివల్ల పురుగుమందులు ఇతర ఉత్పాదకాల ఖర్చులు ఏమయినా తగ్గాయా....అనే దృష్టితోనే అందరం పని చేయాలి. చివరికి, రైతులే ఇది తమకు లాభమా కాదా అని ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు.

ఎన్.పి.ఎం. అనేది మనం రైతులకు చేరువ కావడానికి ఉపయోగపడే 'ఎంట్రీ పాయింట్' మాత్రమే. తరువాత విత్తనాలు, భూసారం వంటివి పట్టించుకోవాలి. ఇందుకోసం ఒక కార్యాచరణ ప్రణాళికను మనం తయారు చేసుకోవాలి. మార్కెటింగ్‌లో రైతులకు శిక్షణ అందించాల్సి ఉంది. పేదలలో కొనుగోలు శక్తి పెరగకుండా వ్యవసాయం అభివృద్ధి చెందదు.

# పురుగుమందుల్లేని వ్యవసాయం

పంటలకు చీడ పురుగుల సమస్య మనిషి వ్యవసాయం ప్రారంభించినప్పటి నుంచి వుంది. మొత్తం జీవ ప్రపంచంలో పురుగులు 75 శాతం వుంటాయి. భూమి మీద పురుగులు పుట్టి 30 కోట్ల సంవత్సరాలు అయితే మనిషి పుట్టి 10 లక్షల సంవత్సరాలు మాత్రమే. ఇలా పురుగులు యెక్కువ సంఖ్యలో ఇన్ని సంవత్సరాలుగా వుండటానికి కారణాలు..ఎటువంటి పరిస్థితులకైనా తట్టుకునే వాటిస్వభావం, శరీర నిర్మాణం, ఎక్కువగా గుడ్లు పెట్టే శక్తి, ఎగరగలిగే గుణం. అలాగని పురుగులు అలాగే పెరుగుతూపోతే...ఈ పాటికే భూమి అంతా పురుగులతో కృపబడి పోవాలి. ఇలా జరగకపోవటానికి కారణం..సహజంగా ప్రకృతి వీటిపై వుంచే అదుపు. రైతులు తరతరాలుగా అనుభవంతో అభివృద్ధి చేసిన పురుగు-నియంత్రణ పద్ధతులు కూడా పురుగులను అదుపు చేశాయి.

ఆధునిక రసాయనిక వ్యవసాయంతో ఇవన్నీ మారిపోయాయి. ఈ క్రమంలో వచ్చిన అధిక దిగుబడి నిచ్చే వంగడాలు, సంకరజాతి వంగడాలు, మట్టిలో సహజంగా వుండే పోషకాలతో తీరని వాటి ఆకలిని తీర్చటానికి రసాయనిక ఎరువులు, విపరీతమైన వాటి దాహం తీర్చటానికి పెద్ద పెద్ద డ్యాములు..ఇవన్నీ ప్రకృతిలోని సమతుల్యతను దెబ్బతీశాయి. దీంతో చీడ పురుగుల సమస్య ఎక్కువైంది. వాటిని చంపటానికి వచ్చిన రసాయనిక మందులతో ఈ సమస్య మరింత తీవ్రమైంది.

### పురుగు ఉధృతికి ముఖ్య కారణాలు :

- ★ పురుగుకు అనుకూలమైన వాతావరణం, సహజ శత్రువులకు ప్రతికూల పరిస్థితులు.
- ★ ఎక్కువ విస్తీర్ణంలో ఒకే పంటను, ఒకే రకాన్ని వేయటం (మోనో క్రాపింగ్)
- ★ చీడ పురుగుల సహజ శత్రువులు లేని ప్రదేశాలకు పురుగుల దిగుమతి.
- ★ విపరీతమైన పురుగు మందుల వాడకం వల్ల పురుగుల సహజ శత్రువులు నాశనం కావడం.
- ★ ఇతర పురుగులు (నాన్ టార్గెట్) నాశనం అయ్యి చీడపురుగులకు పోటీ లేకపోవటం.
- ★ తట్టుకునే శక్తిలేని పురుగులు చనిపోయి, తట్టుకునే శక్తివున్న పురుగులు మాత్రమే బ్రతికి వుండటం.
- ★ చీడ పురుగులు తమ మీద ఒత్తిడికి తట్టుకునే శక్తి పెంచుకోవటం.

### ఆఖరి అంశాన్ని విపులంగా చూస్తే....

మన ముఖ్య పంటలను నాశనం చేసే చాలా పురుగులు ఒక సంవత్సర కాలంలో కనీసం ఎనిమిది తరాలు పూర్తి చేసుకుంటాయి. అంటే అయిదు సంవత్సరాలలో కనీసం 40 తరాలు పూర్తి చేసుకుంటాయి. మొదటి తరంలో పురుగు మందు కొట్టినపుడు దాని ప్రభావానికి చనిపోయినవి పోగా తప్పించుకున్నవి, తట్టుకునే శక్తి వున్నవి రెండవ తరంలోకి వెళతాయి. రెండవ తరంపై మందు కొట్టినపుడు ఇంతకు ముందు తప్పించుకున్నవి, వాటి సంతతి చనిపోయి తట్టుకునేవి బ్రతికి వుంటాయి. ఇలా ఐదవ సంవత్సరం వచ్చే సరికి మొదటి తరంపై పనిచేసిన మందు నలభయ్యవ తరంపై అదే విధంగా పనిచేయదు. అలాగే, పురుగులలో స్వతహాగా తట్టుకునే శక్తి మొదట లేకపోయినా, మందులు చల్లినప్పుడల్లా చాలా పురుగులు చనిపోతూ ఉన్నా, మిగిలిన పురుగులు ఆ మందుల ఒత్తిడికి తట్టుకునే శక్తిని పెంచుకుంటాయి. ఈ శక్తి తర్వాత తరాలకు కూడా సంక్రమిస్తుంది. ప్రతి జీవి తన ఉనికి కోసం చేసే పోరాటంలో భాగంగా, ఈ పురుగులు పురుగుమందులకు నిరోధక శక్తి పెంచుకోవటం సహజం. దీనితో పురుగు మందులు నిరుపయోగమయ్యి పురుగుల సమస్య ఎక్కువవుతుంది. ఇదొక విషవలయం. ఈ క్రమంలో ఎక్కువసార్లు మందులు పిచికారి చేసి, ఖరీదైన కొత్త మందులు వాడి రైతులు ఆర్థికంగా నష్టపోతారు.

### ప్రత్యామ్నాయం...

పురుగుల నియంత్రణకు ఉత్తమ మార్గం ప్రకృతిలోని సహజ సమతుల్యతని తిరిగి సాధించటమే. ఇప్పటికే పురుగు మందులవల్ల దెబ్బతిన్న ఈ సమతుల్యతను తిరిగి సాధించటానికి కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు. మార్కెట్‌లో కొనే రసాయనికాలకు ప్రత్యామ్నాయంగా రైతులు తమ విజ్ఞానాన్ని, యాజమాన్య నైపుణ్యాన్ని, శ్రమను వాడుకొని, ప్రకృతిలో సహజంగా జరిగే ప్రక్రియలను, స్థానికంగా దొరికే వనరులను వాడుకొని చేసే పద్ధతులతో వ్యవసాయంలో సుస్థిరత్వం సాధించవచ్చు. పురుగుల నియంత్రణకు ఉపయోగించే ఇటువంటి పద్ధతులను నాన్-పెస్టిసైడల్ మ్యానేజ్‌మెంట్ (NPM) అని, సహజ రక్షణ పద్ధతులు అని అంటున్నాము.

### పురుగుల నియంత్రణలో సుస్థిర వ్యవసాయ పద్ధతులు

**రైతుల విజ్ఞానం :** పురుగుల జీవిత చక్రాన్ని అర్థం చేసుకొని పురుగు నష్టం కలుగజేసే స్థాయికి, నష్టం కలుగజేసే దశకు చేరుకోకుండా అడ్డుకోవటం. పొలంలోని పర్యావరణ సమతుల్యతను అర్థం చేసుకోవటం.

**యాజమాన్య నైపుణ్యం :** లింగాకర్షక బుట్టలు, దీపపు ఎరలు వంటివి వాడి పురుగుల ఉధృతి గమనించటం, సామూహికంగా మంటలు వేయటం, ఎర పంటలు మొదలయిన సరైన చర్యలు చేపట్టడం.

**శ్రమ :** పురుగులు చిన్న దశలో చేరినప్పుడు ఏరివేత, స్థానికంగా దొరికే వస్తువులతో కషాయాల తయారీ చేసి పిచికారీ చేయడం మొదలైనవి.

**ప్రకృతిలో జరిగే సహజ ప్రక్రియలు :** రసాయనిక పురుగు మందులు వాడటం ఆపివేయగానే ప్రకృతిలో సహజంగా వుండే అనేక రకాల రైతుమిత్ర కీటకాలు, పురుగులకు సహజంగా వచ్చే జబ్బులు వంటివి పెరిగి పురుగులను అదుపులో వుంచుతాయి.

**స్థానికంగా దొరికే వనరులు :** వేప, వావిలాకు, కానుగ లాంటి చెట్ల నుంచి గింజలు / ఆకుల కషాయాలు, పశువుల పేడ - మూత్రం ద్రావణం, మిరప-వెల్లుల్లి ద్రావణం తయారు చేసుకొని పురుగుల నియంత్రణకి వాడుకోవచ్చును.

**సామూహిక చర్యలు :** వ్యవసాయం సామూహిక వ్యాపకం. ఒక వ్యక్తి చేసే వ్యాపారం కాదు. ఒక పొలంలో పురుగుల బెడద ఆ రైతు వేసిన పంట, చేపట్టిన చర్యల మీదనే కాక చుట్టపక్కల రైతులు వేసిన పంట, వారు చేపట్టిన చర్యల మీద కూడా ఆధారపడి వుంటుంది. ఈ సంగతి గుర్తించి సామూహికంగా చర్యలు చేపట్టడం సుస్థిర వ్యవసాయంలో ముఖ్య అంశం.

**మహిళల పాత్ర :** మహిళలు వ్యవసాయంలో పురుషులతో సమానమైన పాత్ర పోషిస్తారు. అయితే రసాయనిక వ్యవసాయంలో వీరి పాత్ర కేవలం మందులు కలపటం వంటి వాటికే పరిమితం. సహజ రక్షణ పద్ధతులు ప్రారంభించటంతో మహిళలది కీలకమైన పాత్ర అవుతుంది.

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in